క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియంలో బోధించేందుకు ప్రభుత్వం అతిథి అధ్యాపకులను ఆహ్వానించింది. బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయం నుంచి నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 24 సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు తమ దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం ఉన్నప్పటికీ అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈవిషయంపై సాక్షిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు ఎట్టకేలకు ఉర్దూ మీడియం బోధించుటకు అతిథి అధ్యాపకుల కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు'

ఉట్నూర్‌రూరల్: సీఎం కేసీఆర్ సంక్షేమలు, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ఎంపీపీ జైవంత్ రావు అన్నారు. బుధవారం మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. వసతి, బోధన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోవాలని అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీటీం

నార్నూర్: మహిళల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందని షీటీం ఇన్‌చార్జి భాగ్యశ్రీ,, కమల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే వెంటనే షీటీం బృందానికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విఠల్. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామసభలు

నేరడిగొండ: మండలంలోని వాంకిడి, దర్బా తండా, రాజుర, వెంకటాపూర్, తేజాపూర్, బోరిగాం, నాగమల్యాల్, చిన్నబుగ్గారం, కొర్టికల్ (కె), కుంటాల (బి),నేరడిగొండ, సవర్గాం, యాపల్‌గూడ, పీచర, ఇస్పూర్, గుత్పాల గ్రామాల్లో బుధవారం ఉపాధిహామీ గ్రామసభలను నిర్వహించారు. 2021- 2023 సంవత్సరం వరకు చేపట్టిన పనుల వివరాలను ఆడిట్ బృందం చదివి వినిపించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయాలి

నేరడిగొండ: వానాకాలంలో వేసిన పంటల వివరాలను మండల రైతులు ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని తేజాపూర్, దర్బాతండా, దర్బ గ్రామాల్లో చేపడుతున్న పంట నమోదు తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగు విస్తీర్ణం, పంటల వివరాలు కచ్చితంగా సర్వే చేసి పోర్టల్‌లో నమోదు చేస్తున్నామన్నారు. గంజాయి సాగు చేసే రైతులకు రైతుబంధు పథకం నిలిపి వేస్తామన్నారు. ఆయన వెంట ఏఈవోలు స్వర్ణలత, తలకొక్కుల సుప్రియ, రైతులు ఉన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి

నేరడిగొండ: నులిపురుగు నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బుధవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో కలిసి నులి పురుగులకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'వరదనీరు రాకుండా చర్యలు చేపట్టాలి'

కైలాస్‌నగర్: డ్రెయినేజీలు దెబ్బతినడంతో వార్డు నం.31 అబ్దుల్లా చౌక్‌లోని పలు ఇళ్లలోకి వరదనీరు వస్తుందని వెంటనే చర్యలు చేపట్టాలని వైఎస్సార్ టీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అస్లమ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ శైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా డ్రెయినేజీపై ఉన్న ర్యాంప్ దెబ్బతిందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

నేరడిగొండ: రానున్న ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలిపించి పార్టీ జెండాను ఎగురవేస్తామని ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో టీపీసీసీ రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న విషయాలపై చర్చించినట్లు తెలిపారు.



బోథ్: కొట్టుకుపోయిన సాంగ్వి, రాంనగర్ రోడ్డు



తాంసి: పంటచేలలో నిలిచిన వర్షపు నీరు

వదలని ముసురు

తాంసి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలకు భారీగా వరద నీరు వచ్చి చేరింది. బుధవారం భీంపూర్ మండలంలోని కరంజి(టి) వాగు ఉధృతంగా ప్రవహించింది. వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. వరుస వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భీంపూర్ మండలంలోని పలు గ్రామాల గుండా ఉన్న అంతర్‌రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు చేరింది. ఇందూర్‌పల్లి సమీపంలో రోడ్డు బురదమయంగా మారింది. అర్లి(టి), వడూర్ గ్రామాల మధ్య కల్వర్టు కోతకు గురైంది.

బోథ్: మూడు రోజులుగా కురుస్తున్న ఏకధాటి వర్షాలకు బోథ్ మండలంలోని రాంనగర్, సాంగ్వి పల్లెకు వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రోడ్డు కొట్టుకుపోవడంతో బురదమయంగా మారింది. వాగు ఉధృతంగా ప్రవహించడంతో వంతెనపై నుంచి వరదనీరు పారుతోంది.



తాంసి: ఉధృతంగా ప్రవహిస్తున్న కరంజి(టి) వాగు



తాంసి: బురదమయంగా ఇందూర్‌పల్లి రోడ్డు

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం పండుగ నిలుస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రణదీవెనగర్‌లో మౌలాలి కర్బలా దేవస్థానం వద్ద నిర్మించిన షెడ్డు ప్రారంభించారు. దేవస్థానం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నిమతాల వారు పండుగలను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. సవారీ బంగ్లాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా షెడ్లను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, అజయ్, రవి, అశోక్ స్వామి, పర్వేజ్, గణేశ్ పాల్గొన్నారు.

తలమడుగు: మొహర్రం ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మాజీ విజయ డెయిరీ చైర్మన్ లోక భూమ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో హస్సన్ హుస్సేన్ దేవస్థానంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామస్తులందరూ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని తెలిపారు. గ్రామస్తులు శ్రీనివాస్, భూమారెడ్డి, సర్పంచ్ పోతరెడ్డి పాల్గొన్నారు.



షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

'పోడు భూములకు పట్టాలివ్వాలి'

ఇంద్రవెల్లి: ఆదివాసీ గిరిజనులు సాగు చేస్తుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని దోడందా గ్రామంలోని 100 మంది పోడు భూములు సాగు చేస్తున్నా.. ఒక్క రైతుకు కూడా హక్కుపత్రాలు రాలేదన్నారు. ప్రభుత్వం ఆదివాసీలను మోసం చేస్తుందని ఆరోపించారు. పూర్తిగా పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. ఆదివాసీలు ఐక్యంగా ఉండి ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నారు. ఈనెల 24న ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పెందోర్ పుష్పరాణి, సోయం రాందాస్, రైతులు తుంరం ధన్ను, పెందోర్ అంకుశ్, మెస్రం మురారి, పుసం కరుణ్‌బాయి, హీరాబాయి, తుర్పబాయి, పెందోర్ లచ్చుబాయి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెల్ట్‌షాపులు తొలగించాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను తొలగించాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బెల్ట్‌షాపులు పుట్టగొడుగులా వెలిశాయని వెంటనే మూసివేయాలన్నారు. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్‌వాగ్ దత్త, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అతిష్ కాంబ్లే, వాగ్మరే కాంరాజ్, కోశాధికారి కాంబ్లే సునీల్, కోవ కోసుబాయి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

రైతుల సంక్షేమమే ధ్యేయం

బజార్‌హత్నూర్: సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో వ్యవసాయానికి 24 గంటల కరెంటుపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిందని, రైతులకు రైతుబంధు, రైతుబీమా, పంటలకు గిట్టుబాటుధర ఇస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మవద్దన్నారు. బీఎస్పీ జిల్లా నాయకులు మెస్రం జంగుబాబు, పంచాక్షరి, గడుగు మహేందర్‌లు బజార్‌హత్నూర్, ఇచ్చోడ మండల కేంద్రాలలో రోడ్లు బాగు చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గం అధికార ప్రతినిధి మెట్టే కిరణ్, మండల కన్వీనర్ కానిందే రాజారాం, సర్పంచ్ పరచ లావణ్య సాయన్న, దావుల భోజన్న, భాస్కర్‌రెడ్డి, నర్సారెడ్డి, సాయిచైతన్య, చంద్రశేఖర్, విలాస్, సాయన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

'వసతుల కల్పనలో ఎమ్మెల్యే విఫలం'

ఆదిలాబాద్: కనీస వసతుల కల్పనలో ఎమ్మెల్యే జోగు రామన్న విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బంగారుగూడ కాలనీలో బుధవారం పర్యటించారు. ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరుతుందని, సమస్యను పరిష్కరించాలన్నారు. నిరుపేదలు ఉంటున్న కాలనీలో సరైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పశువధశాలను తరలించాలని వినతి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పశువధశాలను అక్కడి నుంచి తరలించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినీ రెడ్డి కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పశువధశాల నిర్వహణతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే రిమ్స్ ఆసుపత్రిలో పనిచేసే కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలను అందించేలా చూడాలని విన్నవించారు. ఆమె వెంట బీజేపీ నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న సుహాసినిరెడ్డి

కమాండెంట్‌కు సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ శివారు ప్రాంతంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ రెండో బెటాలియన్ కమాండెంట్ ఆర్ వేణుగోపాల్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ విధులు నిర్వర్తించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ కేవీవీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సంతోషంగా ఉన్నారు

బోథ్: బీఆర్ఎస్ హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారని మాజీ ఎంపీ నగేశ్ అన్నారు. బుధవారం మండలంలోని ధన్నూర్, కుచులాపూర్, జీడిపల్లె, కండిపల్లె, నారాయణపూర్ గ్రామాల్లో ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో కలిసి పర్యటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తామని ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బండారి శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, ఆడె శీల, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

బోథ్: పంచాయతీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న దీక్షలకు మద్దతు తెలిపారు. అలాగే బోథ్ డివిజన్ కోసం చేస్తున్న దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొనాల మండలం ఏర్పాటుపై చూపిన శ్రద్ధ బోథ్ డివిజన్ ఏర్పాటుపై చూపించాలని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. నాయకులు కారెం రవి, అన్నెపాక అశోక్, నల్ల చిన్నయ్య, రాజన్నలు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

నేరడిగొండ: విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. బుధవారం మండలంలోని కుంటాల ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థినుల ఆరోగ్య రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు శంకర్, తదితరులు ఉన్నారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

ఎదులాపురం: వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని, రుణాలు మాఫీ కాకపోవడంతో బ్యాంకుల్లో కొత్త రుణాలు రాక, పాత రుణాలు తీరక రైతుల బతుకులు అగమ్యగోచరంగా మారాయన్నారు. సమావేశంలో నాయకులు అరుణ్ కుమార్, కుంటాల రాములు, గేడం కేశవ్, బెజ్జంకి నర్సింగరావు, ముకుంద రావు, అశోక్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థిని అభినందించిన పీవో

నార్నూర్: మండలంలోని ఉమ్రీ గ్రామానికి చెందిన జాదవ్ సంతోశ్, అంజన దంపతుల కుమారుడు జాదవ్ రాజు జాతీయ స్థాయిలో ఐటీటీలో ఎస్టీ కోట కింద 68 ర్యాంకు సాధించి, ఐఐటీ బాంబేలో సీటు పొందాడు. బుధవారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ విద్యార్థిని అభినందించారు. ఐటీడీఏ తరుపున ల్యాప్‌ట్యాప్ అందజేశారు. మారుమూల గ్రామం నుంచి ఉన్నత లక్ష్యంతో చదివి జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించిన రాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

బరంపూర్‌ను మండలంగా ప్రకటించాలి

● కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు

తలమడుగు: బరంపూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మాజీ జెడ్పీటీసీ బాబన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువ కావాలంటే బరంపూర్‌ను మండలం చేయాలన్నారు. చిన్న మండలాల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మేకల మధుకర్, వైస్ ఎంపీపీ పెందుర్ దివ్య మాధవ్, కమలాకర్, రమేశ్ రెడ్డి, సోమన్న, సర్పంచ్ నార్ కిష్టన్న, అబ్దుల్లా, రమేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాగర్ గౌడ్, భూమారెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నార్నూర్: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ దుర్వా లక్ష్మణ్ అన్నారు. బుధవారం గాదిగూడ మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బందికి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. బీఎల్‌వోలు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ.. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమో దు చేసుకోనేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్ఐలు ప్రభావతి, అనుసూయ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: గౌడజన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భూపతి గౌడ్, అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నర్సాగౌడ్, నాందేవ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా రాజుగౌడ్, గంగాగౌడ్, భీమాగౌడ్, ప్రధాన కార్యదర్శులుగా సంతోశ్‌గౌడ్, బాబాగౌడ్, కార్యదర్శులుగా విజయ్‌గౌడ్, బాలరాజు గౌడ్, బొల్లెపెల్లి శ్రీనివాస్ గౌడ్, శంకర్ వార్ నానాజీగౌడ్, సీపతి బాలాజీ, బండి శ్రీనివాస్ గౌడ్, ప్రచార కార్యదర్శులుగా అనిల్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కుంట రవీందర్ గౌడ్, అధికార ప్రతినిధులుగా ముత్యం పేట్ శిరీష్‌గౌడ్, డోరేవార్ నర్సాగౌడ్, గణేశ్ గౌడ్, తదితరులను ఎన్నుకున్నారు.

పనులు వేగవంతం చేయాలి

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 అవార్డులో భాగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్ గ్రామానికి సందర్శించి అధికారులు, గ్రామస్తులతో సమావేశమై అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళ సంఘాల సభ్యులతో మాట్లాడి స్వచ్ఛత వివరాలపై ఆరా తీశారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డీఆర్‌డీవో కిషన్, సర్పంచ్ తుంరం బాగుబాయి, కనక తుకారం, మర్సుకోల తిరుపతి, జునైద్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ఉట్నూర్‌రూరల్: బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళాలన్నారు. బుధవారం లింగోజీతండాలో ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని బూత్ – సబ్సే మజ్బూత్‌లో భాగంగా బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్, శ్రీరామ్, కొండేరి రమేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాథోడ్ రమేశ్

అటెన్షన్ ప్లీజ్.. అసంపూర్తిగా వంతెన నిర్మాణం



బజార్‌హత్నూర్: మండల సమీపంలోని చిన్నహత్నూర్ వాగుపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో 52 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వంతెన రెండువైపులా బీటీ రోడ్డు వేయకపోవడంతో వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: సునీల్, డీఈ ఆర్‌అండ్‌బీ, ఫోన్: 84649 60600

సంక్షిప్త వార్తలు

నేడు జూనియర్ డాక్టర్ల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ.. గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపనున్నట్లు జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు అరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. వారు డాక్టర్లుగా ప్రాక్టీస్ చేసే అవకాశాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నేరడిగొండ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నేరడిగొండలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సమద్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు నివేదిక చదివి వినిపిస్తారని పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

గుడిహత్నూర్: మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 25 మంది పేద విద్యార్థులకు సామాజిక సేవకుడు జైదేవి మెడికల్ నిర్వాహకుడు మదన్ గిత్తే ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడి సుభాష్, హెచ్ఎం బాలాతాయి పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

బజార్‌హత్నూర్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో చౌహన్ రాధ అన్నారు. బుధవారం మండలంలోని పిప్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇంకుడుగుంతల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హరితహారంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత రఘునీరెడ్డి, ఎంపీటీసీ పండగ మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లేట్లు అందజేత

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉపాధ్యాయుడు రమేశ్ భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అమరేందర్, పవన్ కుమార్, ఉమామహేశ్వర్, సంతోశ్ కుమార పాల్గొన్నారు.

పీవోను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్‌ను బుధవారం మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల సమస్యలను పీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీపీ జైవంత్‌రావు, మండల అధ్యక్షుడు రమేశ్, రషీద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జూనియర్ లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే జోగు రామన్నను మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేశారని పేర్కొన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఉపేందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, అశోక్‌రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.